క్లుప్తంగా

ఏఐపీకేఎంఎస్ డివిజన్ నూతన కార్యవర్గం



అధ్యక్ష, కార్యదర్శులు కిషోర్, శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్: అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్) కల్లూరు డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సత్తుపల్లిలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సారా కిషోర్, గంటా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా కుంటా కృష్ణ, సహాయ కార్యదర్శిగా బైట సురేష్, కోశాధికారిగా గద్దం వెంకన్నతో పాటు మరో నలుగురితో కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు తెలిపారు. ఈ సందర్భగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవసాయ కార్మికులకు జీవన భృతిగా నెలకు రూ.వెయ్యి ఇస్తామన్న హామీని అమలుచేయడంతో పాటు వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టాన్ని అమలు చేయాలని, ఉపాధి హామీ కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

నిమజ్జనం ప్రశాంతంగా నిర్వహించాలి

చింతకాని: శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని వైరా సీఐ సాగర్ సూచించారు. చింతకాని పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకుల సమావేశం బుధవారం నిర్వహించగా సీఐ మాట్లాడారు. ఊరేగింపులో డీజేలకు అనుమతి ఉండదని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రామకృష్ణాపురం, అనంతసాగర్, పాతర్లపాడు గ్రామాలు పోలీసు నిఘాలో ఉన్నందున ఘర్షణకు పాల్పడితే కేసు నమోదు చేస్తామని సీఐ తెలిపారు. ఎస్సై వీరేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

కోట మైసమ్మకు కోటి దండాలు!

- నేటి నుంచి ఉసిరికాయలపల్లి జాతర
- వేలాదిగా తరలిరానున్న భక్తజనం


ఉసిరికాయలపల్లిలోని కోటమైసమ్మతల్లి ఆలయం


జాతరలో ఏర్పాటు చేసిన జాయింట్ వీల్


ఆలయంలో కొలువుదీరిన కోటమైసమ్మతల్లి

కారేపల్లి: కొలిచిన వారికి కొంగు బంగారమై భక్తుల కోర్కెలు తీర్చే శ్రీ కోటమైసమ్మ తల్లి జాతరకు వేళయింది. దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని ఏటా దేవాదాయ ధర్మాదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన నిర్వహించే కోటమైసమ్మతల్లి జాతరకు వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. కారేపల్లి మండలం ఉసిరికాయలపల్లిలో కొలువుదీరిన తల్లిని దర్శించుకునేందుకు భక్తులు ప్రభబండ్లతో ఊరేగింపుగా వస్తారు.

ఐదు రోజుల పాటు జాతర

దసరా సందర్భంగా గురువారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు కోటమైసమ్మ తల్లి జాతర జరగనుంది. ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి జిల్లా నుంచి ఇల్లెందు, టేకులపల్లి, గుండాల, మహబూబాబాద్ జిల్లా బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల నుంచి భక్తులు తల్లి దర్శనానికివస్తారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి భక్తులు ప్రభబండ్లతో ఊరేగింపుగా మేళతాళాల నడుమ రావడం ఆకట్టుకుంది. ఈమేరకు ఆలయ ఈఓ కొండకింది వేణుగోపాలాచార్యులు, పర్సా ట్రస్టు చైర్మన్ పట్టాభిరామారావు ఆధ్వర్యాన ఏర్పాట్లు చేశారు.

భారీ బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేస్తున్నారు. ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి పర్యవేక్షణలో ఇద్దరు సీఐలు, 10మంది ఎస్సైలు, వంద మంది కానిస్టేబళ్లు విధులు నిర్వర్తించనున్నారు. అలాగే, సింగరేణి మండల పరిషత్ ఆధ్వర్యంలో ఆరు వాటర్ ట్యాంకులతో తాగునీరు సమకూరుస్తుండగా, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ఇద్దరి గ్రామ కార్యదర్శుల పర్యవేక్షణలో 12మంది కార్మికులను నియమించారు. అలాగే, విద్యుత్ సమస్య రాకుండా 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేశారు. అంతేకాక ఖమ్మం నుంచి కారేపల్లి, ఉసిరికాయలపల్లి మీదుగా ఇల్లెందుకు ఆర్టీసీ బస్సులు నడపనుంది. ఇక భక్తులు అమ్మవారిని దర్శించుకున్నాక ఉత్సాహంగా గడిపేందుకు జాతర ప్రాంగణంలో సర్కస్, జాయింట్ వీల్ ఏర్పాటుచేశారు. అలాగే, ఆట బొమ్మలు, గృహోపకరణ వస్తువులు, తినుబండారాల దుకాణాలు వెలిసాయి. ఇక ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన కైలాస శంకరుడు, 20 అడుగుల ఎత్తు పంచముఖ ఆంజేయస్వామి విగ్రహాల వద్ద భక్తులు పూజలు చేస్తారు.

వర్షం లేకుంటేనే సాఫీగా..



వర్షం కురవడంతో జాయింట్ వీల్, సర్కస్ ఏర్పాటులో ఆలస్యమైంది. జాతర జరిగినన్ని రోజులు వర్షం రాకపోతేనే సాఫీగాసాగుతుంది. ఈ ఏడాది భక్తులు అధికంగా వచ్చి వర్షం లేకపోతే మాకు ఎంతోకొంత లాభం మిగులుతుంది.

– జి.సత్య, జాయింట్ వీల్ నిర్వాహకుడు, గుంటూరు

జాతరకు అన్ని ఏర్పాట్లుచేశాం



జాతరకు వేలాదిగా వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా దేవాదాయ శాఖ, పర్సా ట్రస్టు ఆధ్వర్యాన అన్ని ఏర్పాట్లు చేశాం. దర్శనం సాఫీగా సాగేలా క్యూలైన్లు ఏర్పాటుచేసి తాగునీటి సౌకర్యం కల్పించాం. హెల్త్ క్యాంపు కూడా ఉంటుంది.

– పట్టాభిరామారావు, పర్సా ట్రస్టు చైర్మన్

వినూత్నంగా బతుకమ్మ


ఏన్కూరు : హంస ఆకారంలో తీర్చి దిద్దిన బతుకమ్మ

ఏన్కూరు/సత్తుపల్లి రూరల్: ఏన్కూరు మండలం కేసుపల్లిలో వినూత్నంగా హంస ఆకారంలో బతుకమ్మను తీర్చిదిద్దారు. ఏటా దసరా పర్వదినం ముగిశాక అమ్మవారి విగ్రహంతో పాటు బతకమ్మలను సాగనంపడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలో బుధవారం హంస ఆకారంలో బతుకమ్మను పేర్చారు. అలాగే, సత్తుపల్లి మండలం గంగారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది బతుకమ్మలు పేర్చి ఆడిపాడారు. పీహెచ్‌సీ వైద్యాధికారి అవినాష్, ఉద్యోగులు పాల్గొన్నారు.


సత్తుపల్లిరూరల్: గంగారం పీహెచ్‌సీలో బతుకమ్మలతో ఉద్యోగులు

బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి

మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య సూచించారు. సత్తుపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో బుధవారం ముఖ్యనాయకులతో ఆయన సమావేశమయ్యారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి కలిసికట్టుగా కృషి చేస్తూ కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైన విషయాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. తద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయం సులువవుతుందని చెప్పారు. నాయకులు దొడ్డా శంకర్‌రావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, కొత్తూరు ఉమామహేశ్వరరావు, కూసంపూడి మహేష్, కూసంపూడి రామారావు, నాగయ్య, ఎస్‌కె ఖాండ్‌పాషా, మోటపోతుల వెంకటేశ్వరరావు, కాలినేని వెంకటేశ్వరరావు, మొదుగు పుల్లారావు పాల్గొన్నారు.

స్వామినా న్ సిఫారసుల అమలుకు ఉద్యమం

వైరా: రైతుల సంక్షేమం కోసం డాక్టర్ ఎంఎస్.స్వామినాథన్ చేసిన సిఫారసులు అమలుచేయాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతున్నట్లు తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు తెలిపారు. వైరా మున్సిపాలిటీ పరిధి గండగలపాడులో బుధవారం స్వామినాథన్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సమితి కిసాన్ మోర్చా ఆధ్వర్యాన నిర్వహించే ఉద్యమంలో రైతులు భాగస్వాములు కావాలని కోరారు. కాగా, ఇప్పటికే యూరియా దొరకక అవస్థ పడుతుంటే వ్యవసాయ అధికారులకు ఎన్నికల విధులు కేటాయించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో నాయకులు మల్లెంపాటి రామారావు, చిత్తారు మురళి, కామినేని రవి, విద్యాసాగర్, వీరభద్రం, సుధీర్, కమలేశ్వరరావు, కృష్ణ, మణి, సుధాకర్ పాల్గొన్నారు.



స్థానిక ఎన్నికలకు బీజేపీ సిద్ధం

మధిర: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి బీజేపీ అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని పార్టీ మండల అధ్యక్షుడు గద్దం శ్రీహరి చౌదరి తెలిపారు. మధిరలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజర్వేషన్ల ఆధారంగా పోటీకి అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నాయకులు గుండా చంద్రశేఖర్ రెడ్డి, పెరుమాళ్లపల్లి విజయరాజు, బాడిశ అర్జున్‌రావు, కనకాచారి, మోహన్‌రావు, వీరబ్రహ్మం, రామ యోగేశ్వరరావు, అనిల్, దినకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● **సత్తుపల్లిరూరల్:** జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులు పోటీ చేస్తారని బీజేపీ నాయకుడు సుదర్శన్ మిశ్రా తెలిపారు. సత్తుపల్లి రూరల్ మండల అధ్యక్షుడు సాలి శివకృష్ణ ఆధ్వర్యాన సత్తుపల్లిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చని అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని సూచించారు. మండల ప్రధాన కార్యదర్శి వేముల లక్ష్మీనారాయణ, నాయకులు జొన్నలగడ్డ నరేష్, పడగల మధుసూదన్‌రావు, పాల సురేందర్‌రెడ్డి, చీకటి వసంతరావు, మెరుగు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మత్కేపల్లి మార్కెట్ చైర్మన్‌కు సన్మానం

చింతకాని: మండలంలోని మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా నియమితులైన అంబటి వెంకటేశ్వరరావును పంచాయతీ రాజ్ శాఖ అధికారులు బుధవారం సన్మానించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, డీఈ శ్రీనివాసరావు, బోనకల్ ఏఈ నవీన్, రిటైర్డ్ డీఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రూప్–1 విజేతకు..

కల్లూరురూరల్: గ్రూప్–1 ఫలితాల్లో సత్తా చాటి ఎంపీడీఓగా ఎంపికైన మండలంలోని పేరువంచకు చెందిన మంచాల అంజయ్య – అపరంజి కుమార్తె సుజాతను పలువురు సన్మానించారు. రిటైర్డ్ ఉపాధ్యాయులు కీసర మోహన్‌రెడ్డితో పాటు జోనబోయిన గోపాలరావు, మరకాల రత్నాకర్, ముళ్లపాటి నాగేశ్వరరావు, మంచాల మాధవరావు, సుందర్‌రావు, మల్లయ్యతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గార్లొడ్డు దేవాలయానికి స్టీలు స్టాండ్ల వితరణ

ఏన్కూరు: మండలంలోని గార్లొడ్డు శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన కలకోట రమణాచార్యులు – కిరణ్మయి దంపతుల కుమారులు శ్రీతేజ, రవితేజ రూ.20వేల విలువైన స్టీలు స్టాండ్లు, స్టూళ్లు బహూకరించారు. శ్రీతేజ అమెరికా వెళ్తున్న సందర్భంగా వీటిని అందజేసినట్లు తెలిపారు. ఆలయ ఈఓ వెంకట దుర్గాప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ నారాయణ, అర్చకులు చిలుకూరి వేణుగోపాలాచార్యులు, నాగరాజాచార్యులు, కిరణ్‌కుమార్‌చార్యులు పాల్గొన్నారు.

నాగభూషణం సేవలు మరువలేనివి..

బోనకల్: సీపీఐ సీనియర్ నాయకుడు, ఆళ్లపాడు మాజీ సర్పంచ్ బుంగా నాగభూషణం, సీపీఐ సీనియర్ నాయకురాలు బుంగా వెంకటనర్సమ్మ సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. మండలంలోని ఆళ్లపాడులో నాగభూషణం ప్రథమ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాక సురేష్ మాట్లాడారు. సీపీఐ నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, తోట రామాంజనేయులు, మల్లికార్జున్‌రావు, యంగల ఆనందరావు, తూము రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, వివిధ పార్టీల నాయకులు కూడా నివాళులర్పించారు.

పూజలు.. అన్నదానాలు


మధిర : అమ్మవారికి పూజలు నిర్వహించిన భక్తులు

శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. అలంకరణల్లో భాగంగా బుధవారం అమ్మవారిని మహిషాసురమర్దినిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే, పలుచోట్ల మండపాల అన్నదానం ఏర్పాటుచేయగా పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

అ'పూర్వ' సమ్మేళనం


గురువులతో పూర్వ విద్యార్థులు

తల్లాడ: తల్లాడ శ్రీ విద్యానికేతన్‌లో 2000–2001 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సమ్మేళనం బుధవారం జరిగింది. ఈ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు చదువుకున్న కాలం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. అలాగే, తమకు పాఠాలు బోధించిన గురువులను సన్మానించారు.

పిచ్చికుక్క దాడిలో ఐదుగురికి గాయాలు

ఎర్రుపాలెం: మండలంలోని బంజరలో మంగళవారం రాత్రి ఓ పిచ్చికుక్క దాడిచేయగా ఐదుగురికి గాయాలయ్యాయి. ఇళ్ల ఆవరణలో ఉన్న గంజి సామ్రాజ్యం, కందుకూరి ప్రశాంత్, ఆయన కుమారుడితో పాటు మరో ఇరువురిపై కుక్క దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. బాధితులకు బని గండ్లపాడు పీహెచ్‌సీలో చికిత్స అనంతరం ఖమ్మం తరలించారు. కాగా, కుక్కల బెడద నుండి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

బోనకల్: మండలంలోని గోవిందాపురం(ఎల్) గ్రామానికి చెందిన వివాహిత భవ్య(30) మంగళవారం మృతి చెందింది. అయితే, తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఆమె తల్లి చిట్టిశెట్టి ఉమ బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు. చింతకాని మండలం నాగులవంచ గ్రామానికి చెందిన భవ్యకు బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన అడపాల చంద్రరావుతో ఏడాది క్రితం వివాహం జరిగింది. అయితే, భవ్యకు ఫిట్స్ రాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందిందని భర్త తరపు కుటుంబీకులు చెబుతున్నారు.